సాక్షి
నిజామాబాద్
శుక్రవారం। 20। సెప్టెంబర్। 2024



మహిళలకు సర్కారు అండ

మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో తొలి క్యాంటీన్‌ను ఆర్మూర్‌లో ఏర్పాటు చేశారు.

- 8లో ▸



అప్రమత్తంగా ఉండాలి

వరిలో చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.0 /20.7

వాతావరణం

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతాం

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ సిటీ: నగరంలో ప్రభుత్వ స్థలాలను కాపాడుతామని మున్సిపల్ కమిషనర్ మంద మకరందు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలపై ఆక్రమణపై ఆగస్టు 30న సాక్షి పత్రికలో 'పక్కా స్కెచ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. కలెక్టర్‌తో పాటు, సీడీఎం జాయింట్ డైరెక్టర్‌కు వివరణ ఇచ్చారు. సదరు ఖాళీ స్థలాన్ని మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ, తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చుట్టూ కంచె లేదా తాత్కాలిక ప్రహరీ నిర్మించి పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఉత్సవాలకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు

ఖలీల్‌వాడి: జిల్లాలో గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలు శాంతియుతంగా జరుపుకొని సహకరించిన ప్రజలకు సీపీ కల్మేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ ర్యాలీలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించుకున్నట్లు చెప్పారు. నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సహకరించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు సీపీ తెలిపారు.

హోంగార్డు ఏసీపీ బదిలీ


ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డు ఏసీపీగా పని చేస్తున్న అరుణ్‌కుమార్ సైబరాబాద్‌కు గురువారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరు రాలేదు. హోంగార్డు ఏసీపీగా మరో ఏసీపీకి అదనపు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



నిజామాబాద్ అర్బన్: ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఐఈవో తిరుమలపూడి రవికుమార్ సూచించారు. నిజామాబాద్ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాల, మాక్లూరు, ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులతో సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులకు తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రిన్సిపాల్‌లు కాలిక్ పాషా, గంగారాం, చిన్నయ్య పాల్గొన్నారు.

గో విజ్ఞానంపై వీహెచ్‌పీ పుస్తకావిష్కరణ




కామారెడ్డి అర్బన్ : ఆవులతో మానవళికి అనేక ప్రయోజనాలున్నాయని విశ్వహిందూ పరిషత్ గోసేవ విభాగ్ ప్రముఖ్ రాజేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీసరస్వతి విద్యామందిర్‌లో గోమాత వైభవం, గోవిజ్ఞాన పరీక్షలు చేతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. గో సంతతిపై భూసారం, వ్యవసాయం, పాడి పంటలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టత ఎలా ఆధారం పడిందనేది ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు తెలియజెప్పేందుకు పుస్తకాన్ని రూపొందించినట్లు గోసేవ ప్రముఖ్ రాజేశ్వర్ తెలిపారు. పుస్తకంలోని 30 ప్రశ్నలకు జవాబులు రాసిన వారికి వీహెచ్‌పీ గోసేవక్ విభాగం నుంచి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పుస్తకాలు కావాల్సిన వారు 96406 31553 నంబర్‌ను సంప్రదించాలన్నారు. గోసేవక్ కన్వీనర్ చిదుర శివకుమార్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, కస్కంటి రాజు, శిశుమందిర్ ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్: కేజీబీవీలో మిగిలిపోయిన పోస్టులకు అభ్యర్థుల ఎంపిక కోసం గురువారం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. 18 సబ్జెక్టులలో అర్హులైన వారిని నియమించేందుకు రోస్టర్ ప్రకారం అభ్యర్థులను పిలిచారు. గతంలో పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారి అనంతరం రోస్టర్ ప్రకారం అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. మరో రెండు రోజుల్లో నియామకాలు పూర్తి చేస్తామన్నారు.

ఓసీకా.. బీసీకా?

- డీసీసీ పీఠంపై జిల్లాలో జోరుగా చర్చ
- పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ కావడంతో ఆసక్తి
- రేసులో కాటిపల్లి నగేశ్‌రెడ్డి, బాస వేణుగోపాల్ యాదవ్
- కార్పొరేషన్ పదవుల కోసం పలువురి ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎవరు కానున్నారనే విషయమై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియామకం కావడంతో అధ్యక్షుడి మార్పు విషయమై జిల్లావ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా తాజాగా పీసీసీ అధ్యక్షుడిగా జిల్లాకే చెందిన సీనియర్ నేత బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఎన్నిక కావడంతో జిల్లా అధ్యక్ష పదవికి ఎవరిని ఎంపిక చేయనున్నారనే విషయమై అన్ని వర్గాల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో డీసీసీ పీఠం బీసీ నేతకు ఇస్తారా.. ఓసీ నాయకుడికి అప్పగిస్తారా అనే విషయమై ఉత్కంఠ నెలకొంది. కొందరు కీలక నాయకులు స్టేట్ కార్పొరేషన్ పదవుల కోసం వేచిచూస్తున్నారు. స్టేట్ కార్పొరేషన్ పదవుల విషయమై ముఖ్యంగా బాడ్సి శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్ జాబితాలో ఉన్నారు. ఇక జిల్లా ప్రజా పరిషత్, మేయర్, మున్సిపల్ కార్పొరేషన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల విషయమై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ల విషయంలో రిజర్వేషన్ల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నారు.

■ ఓసీ నాయకుడికి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాల్సి వస్తే కాటిపల్లి నగేశ్‌రెడ్డి పేరు వినిపిస్తోంది. నగేశ్‌రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించారు. 1983 నుంచి రాజకీయాల్లో ఉన్న నగేశ్‌రెడ్డి సర్పంచ్‌గా పనిచేశారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. పార్టీ నిజామాబాద్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పటివరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మోపాల్ సొసైటీ చైర్మన్‌గా సేవలందించారు. 10 సంవత్సరాల పాటు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసి తనదైన ముద్ర వేశారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉన్నారు. దీంతో నగేశ్‌రెడ్డికి అవకాశం ఇస్తారనే చర్చ జరుగుతోంది.

■ బీసీ నాయకుడికి కేటాయించాల్సి వస్తే బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లికి చెందిన బాస వేణుగోపాల్ యాదవ్‌కు అవకాశమివ్వనున్నట్లు తెలుస్తోంది. 1996లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వేణుగోపాల్ యాదవ్ రాజకీయాల్లోకి వచ్చారు. తెలంగాణ విశ్వవిద్యాలయ సాధన సమితి కన్వీనర్‌గా పనిచేశారు. బాసర ట్రిబుల్ ఐటీ సాధన కమిటీ కన్వీనర్‌గానూ వ్యవహరించారు. తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగానూ వ్యవహరించారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఇప్పటివరకు కొనసాగారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సన్నిహితుడిగానూ ఉన్నారు. సునీల్‌రెడ్డి తరఫున గత అసెంబ్లీ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా పనిచేశారు. రాష్ట్ర కార్పొరేషన్ పదవి కోసం గట్టిగానే ప్రయత్నం చేశారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి ముగ్గురికి కార్పొరేషన్ పదవులు రావడంతో వేణుగోపాల్‌యాదవ్ డీసీసీ అధ్యక్ష పీఠం రేసులోకి వచ్చారు.

ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పరిశీలకుడు అబ్దుల్ హమీద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- పరిశీలకులు అబ్దుల్ హమీద్

నిజామాబాద్ అర్బన్: ఓటరు జాబితా సవరణ కోసం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం నుంచి వచ్చిన పరిశీలకుడు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి గురువారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26తో గడువు ముగియనున్న దృష్ట్యా ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ జాబితాను సరిచేయాలని, మరణించిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు స్వీప్ ఆక్టివిటీస్ ద్వారా విద్యా సంస్థలు, సామాజిక మాధ్యమాలు, బస్టాండులు తదితర రద్దీ ప్రదేశాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. 15 వందలు ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అలాంటి చోట కొత్తగా మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని సూచించారు. జిల్లాలో ఓటరు జాబితా సవరణ, స్వీప్ ఆక్టివిటీస్, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, తదితర వాటికి సంబంధించి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి ఓటరు జాబితా సవరణ తీరును పరిశీలకుడు హమీద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, కిరణ్మయి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు

నిజామాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్ నుంచి సాంకేతిక లోపాలు తలెత్తిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రత నడుమ గురువారం బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల తరలింపు జరిగింది. పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో 78 బ్యాలెట్ యూనిట్లు, రెండు కంట్రోల్ యూనిట్లను తరలించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.



ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సస్యరక్షణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ హనుమంతు

- వ్యవసాయ అధికారులతో సమీక్షలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- అన్నదాతకు నష్టం చేకూర్చే డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశం

నిజామాబాద్ అర్బన్: చీడపీడల బెడదతో రైతులు నష్టపోకుండా సస్యరక్షణ చర్యలపై వారికి అవగాహన కల్పించాలని బోధన్ సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణ పరిస్థితులలో చోటుచేసుకున్న మార్పులతో పంటలకు దోమపోటు, ఆకుముడత వంటి తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణ కోసం చర్యలు చేపట్టేందుకు వీలుగా గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో పంటలకు నష్టం వాటిల్లకుండా చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో 4.29 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని, అందులో 85 శాతానికి పైగా సన్నరకం అన్నారు. వ్యవసాయ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా చీడపీడలతో రైతులు నష్టపోతే, సంబంధిత వ్యవసాయ అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామన్నారు. అదేవిధంగా రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరించే ఎరువులు, విత్తన దుకాణాల డీలర్ల లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలతో పాటు, అవసరం లేకపోయినప్పటికీ ఎక్కువ పరిమాణంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు అంటగట్టే డీలర్లపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, రాజ్‌కుమార్, దివ్య, ఏడీఏ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు వదిలేదెప్పుడు!

- గడువు దాటుతున్నా పత్తాలేని వైనం
- ఈ ఏడాది పోచంపాడ్‌లో ఉత్పత్తి శూన్యం
- ఆందోళనలో మత్స్యకారులు



ముప్కాల్ మండలం రెంజర్లలో నిండుకుండలా ఉన్న చెరువు

బాల్కొండ: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే చేప పిల్లలను ఈ ఏడాది ఇప్పటి వరకు చెరువుల్లో విడుదల చేయలేదు. నీలి విప్లవంలో భాగంగా వంద శాతం సబ్సిడీపై ప్రభుత్వం చెరువులు, ప్రాజెక్టుల్లో వదలడానికి చేప పిల్లలను సరఫరా చేస్తుంది. ఈ ఏడాది శ్రీరాంసాగర్, రామడుగు ప్రాజెక్టులు, 967 చెరువుల్లో చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. 814 చెరువుల్లో 30–40 ఎంఎం సైజ్ చేపపిల్లలు 2.71 కోట్లు, 153 చెరువుల్లో 80–100 ఎంఎం సైజ్ 1.82 కోట్లు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 68 లక్షలు, రామడుగు రిజర్వాయిర్‌లో ఆరు లక్షల చేప పిల్లలను వదులుటకు నిర్ణయించారు. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వర్షాలు సమృద్ధిగా కురువడంతో చెరువులు, ప్రాజెక్టులు నిండుకుండలా ఉన్నాయి. సకాలంలో చెరువులు, జలాశయాల్లో చేప పిల్లలను వదిలితే వేట సమయానికి పెద్దగా పెరుగుతాయని మత్స్యకారులు అంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేయాలని కోరుతున్నారు.

సామర్థ్యం ఉన్నా..

ప్రస్తుత సంవత్సరం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువ గల జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఒక్క చేప పిల్లను కూడా ఉత్పత్తి చేయలేదు. ఏటా కనీసం రెండు కోట్ల పిల్లలను ఉత్పత్తి చేసేవారు. అలా ఉత్పత్తి చేసి మత్స్య సహకార సంఘాల ద్వారా చెరువులకు పంపిణీ చేసేవారు. కాని ప్రస్తుతం ఆలస్యంగా ప్రాజెక్ట్‌లోకి నీరు రావడంతో చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ చేపట్టిన విఫలమైంది. జిల్లాలోని అన్ని చెరువులకు సరిపడ చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం కేంద్రానికి ఉన్నప్పటికీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఉత్పత్తి కావడం లేదు. ప్రాజెక్ట్ వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఉన్నప్పటికీ ప్రాజెక్ట్‌లోకి వదిలే చేప పిల్లలను ఇతర ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్ ద్వారా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వారం రోజుల్లో ప్రారంభం

చెరువుల్లో చేప పిల్లల వదలడం వారం రోజుల్లో ప్రారంభం అవుతుంది. ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. వారంలో నిర్ణయిస్తామన్నారు. వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను వదులుతారు. మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – ఆంజనేయస్వామి, ఏడీ, నిజామాబాద్

టీఎన్జీవోస్‌లో గెజిటెడ్ అధికారులకు ఎసరు

- తప్పుకోవాలని రాష్ట్ర సంఘం ఆదేశాలు

నిజామాబాద్ అర్బన్: టీఎన్జీవోస్ సంఘంలో గెజిటెడ్ ఉద్యోగులు ఉండకూడదని కేంద్ర నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొంతకాలంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న అలుక కిషన్‌ను పదవి నుంచి తప్పుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో గెజిటెడ్ హోదా కలిగిన వారు అధ్యక్షులుగా కొనసాగుతున్నారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తక్షణమే సంఘం నిబంధనాలను అనుసరించి హోదా ఉన్నవారు టీఎన్జీవోస్ నుంచి తప్పుకోవాలని పేర్కొన్నారు. తక్షణమే జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. జూలైలో ఈ ఆదేశాలు జారీ అయినా వారు తప్పుకోకపోవడంతో ఇటీవల జరిగిన సమావేశంలో సైతం దీనిపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం అలుక కిషన్ టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా, ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆయన టీఎన్జీవోస్ పదవి నుంచి తప్పుకుంటే మరో నలుగురు పోటీ పడుతున్నారు. ఆదేశాలు జారీ అయి రెండు నెలలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. అధ్యక్ష పదవి కోసం గైని గంగారాం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు అలుక కిషన్ రాష్ట్ర కమిటీలో కీలక పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసమే హైదరాబాద్‌కు బదిలీ అయ్యే ప్రయత్నంలో ఉన్నట్లు టీఎన్జీవోస్ నాయకులు పేర్కొంటున్నారు.

నకిలీ నియామకాలపై విద్యాశాఖ దృష్టి

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో నకిలీ నియామకాలపై విద్యాశాఖ దృష్టి సారించింది. గురువారం 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనంపై స్పందించి అధికారులు విచారణ చేపట్టారు. ఏయే పాఠశాలల్లో నియామకాలు చేపట్టారనే వివరాలు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మరోవైపు ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలో సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ అప్రమత్తమైంది. తమ సంస్థ పేరిట కొందరు నకిలీ నియామక పత్రాలను సృష్టించి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని జిల్లా కో ఆర్డినేటర్ త్రివేన్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికి 15 మందిని మాత్రమే నియమించినట్లు చెప్పారు. వీరిని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పరిశీలన తర్వాతే నియామకం చేశామన్నారు. పూర్తిస్థాయి నియామకాలు ఇంకా జరగలేదని పేర్కొన్నారు. తమ సంస్థ పేరు చెప్పుకొని నకిలీ పత్రాలు సృష్టించిన రాజు అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నకిలీ పత్రాలు సృష్టించిన రాజుపై విద్యాశాఖ అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం గ్లోబల్ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త త్రివేన్‌ను పిలిపించి వివరాలు ఆరా తీశారు. జిల్లా అధికారులకు సంప్రదించిన తర్వాతే నియామక పత్రాలు అందజేయాలని ఆదేశించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

- రైతు జేఏసీ నాయకుల డిమాండ్
- తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా

ఆర్మూర్: రైతులకు ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్మూర్ డివిజన్‌లోని తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్మూర్‌లో నాయకులు, రైతులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ గజానాన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు దేవారం, దేగాం యాదాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం కొందరికే అమలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులను సైతం మాఫీ వర్తింపజేయాలని కోరారు. ఏడాదికి ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే వేలాదిమంది రైతు లు ఒక్కటై ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏపీ గంగారాం, రాజన్న, అల్లూరి గంగారెడ్డి, నక్కల రాములు, సురేష్, విజయ్, అంకాపూర్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కంటే ఔట్ ఫ్లో ఎక్కువగా ఉంది. ప్రాజెక్ట్‌లోకి 4140 క్యూసెక్కుల వరద వచ్చి చేరితే కాలువల ద్వారా 10940 క్యూసెక్కుల నీరు పోతోంది. కాకతీయ కాలువ ద్వారా 6800, సరస్వతి కాలువ ద్వారా 550, లక్ష్మి కాలువ ద్వారా 200, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, అలీసాగర్ లిఫ్ట్ 180, వరద కాలువ ద్వారా 2 వేలు, ఆవిరి రూపంలో 709, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

28 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈనెల 28 నుంచి అక్టోబర్ 3 వరకు కొనసాగుతాయని పరీక్షల నియంత్రణాధికారి అరుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

బీఈడీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. మొదటి రోజు పరీక్షకు 1312 మందికి 1250 మంది హాజరయ్యారు.

నేడు కొత్త చట్టాలపై అవగాహన

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి) బ్రిడ్జి పక్కన ఉన్న భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'కొత్త చటాలపై అవగాహన' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పోలీస్ శాఖ అధికారులు గురువారం పేర్కొన్నారు. కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మహిళలకు సర్కారు అండ

- మహిళా శక్తి పేరిట క్యాంటీన్ల ఏర్పాటు
- జిల్లాలో మొదటి క్యాంటీన్ ఆర్మూర్‌లో..



ఆర్మూర్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్

ఆర్మూర్‌టౌన్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వారు ఆర్థిక సంవృద్ధి సాధించేందుకు ఇందిర మహిళా శక్తి పేరిట క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోంది. ఈ పథకం ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే మొదటిసారిగా జిల్లాలోని ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 16న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య క్యాంటీన్‌ను ప్రారంభించారు. జిల్లాలోనే మొదటి క్యాంటీన్ ఆర్మూర్‌లో ఏర్పాటు కావడంపై మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళ శక్తి క్యాంటీన్‌లో పిండి పదార్థాలతో పాటు తెలంగాణ వంటకాలు అందుబాటులో ఉంటుండడంతో సందర్శకులు వీటిని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ మహిళా శక్తి క్యాంటీన్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జర్నలిస్టు కాలనీ సమాఖ్య స్వయం సంఘాల సభ్యుల సమక్షంలో కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఐదు క్యాంటీన్లను ఏర్పాటు చేయనుంది. కలెక్టర్ కార్యాయాల్లో, ఆర్డీవో, ప్రభుత్వ ఆస్పత్రి, జన సమూహం, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కృషి చేస్తోంది.

అందుబాటులో పిండి వంటలు

మహిళ శక్తి క్యాంటీన్‌లో మహిళా సంఘాల సభ్యులు ఇంట్లో తయారు చేసిన తెలంగాణ పిండి వంటలు ఉంటాయి. సకినాలు, లడ్డూలు, అరిసెలు, రాగి లడ్డూలు, పచ్చళ్లు, పూరి, తెలంగాణ భోజనంతో పాటు ఇతర చేతి వంటలు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే ఆర్డర్‌పై కావాల్సిన వంటాకాలు తయారు చేసి ఇస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి. మహిళా శక్తి క్యాంటీన్‌ను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలకు నాణ్యమైన పిండి వంటలను అందించి అందరి మన్ననలు పొందాలి.

– వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్

త్వరలో మరొకటి ఏర్పాటు



స్వయం సహాయక సంఘం సభ్యులు మహిళా శక్తి క్యాంటీన్ బాగా నడిపించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. త్వరలో మరో మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తాం. ప్రజలు మహిళా శక్తి క్యాంటీన్ సద్వినియోగం చేసుకోవాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్

ప్రజలు ఆదరిస్తున్నారు



ఆర్మూర్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. ప్రజలకు ఇప్పుడిప్పుడే క్యాంటీన్ గురించి తెలుస్తోంది. క్యాంటీన్‌లో కొందరు టిఫిన్, మరికొందరు సకినాలు, అప్పాలు వంటివి కొనుగోలు చేసేందుకు వస్తున్నారు.

– లక్ష్మి, స్వయం సహాయక సంఘం సభ్యురాలు

ఆరోగ్య మిత్రల వేతనాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న ఆరోగ్య మిత్రలు

నిజామాబాద్‌నాగారం: రాజీవ్ ఆరోగ్యశ్రీ లో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి, వేతనాలు పెంచాలని ఆరోగ్యశ్రీ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 6న తమ డిమాండ్లను పరిష్కరించాలని అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు రామాగౌడ్, విజయ్, సుమలత, శ్రావణ్, అంబిక, జ్యోతి, మణికుమార్, జీవన్‌రెడ్డి, నరేందర్, అఖిల, సాగర్, సాంబాజీ, సునీల్, రాధిక, పెద్ద స్వామి, భాగ్యలక్ష్మి, రాములు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్అర్బన్: జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్‌గా నియామకాలు చేపడుతున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ గురువారం పేర్కొన్నారు. కరాటే, మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఉన్నవారు అర్హులన్నారు. తాత్కాలిక రెమ్యురేషన్ ప్రతిపాదికన నియమించనున్నట్లు పేర్కొన్నారు. అభ్య ర్థులు సంబంధిత ధ్రువపత్రలతో ఈ నెల 30 వరకు జిల్లా కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష విభాగం రూమ్ నెంబర్ 17లో దరఖాస్తులను అందజేయాలన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగించవద్దని అవగాహన కల్పించారు. సానిటరి ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్



రైతులతో మాట్లాడుతున్న డీఏవో

ఇందల్వాయి: వరిలో చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పలు పంటలను పరిశీలించారు. వరిలో చీడపీడల ఉధృతిపై అప్రమత్తంగా ఉండాలని, పైరును నిత్యం పరిశీలిస్తూ ఐదు శాతం పైరులో తెగుళ్ల వ్యాప్తి చెందినప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. మార్కెట్లో దొరికే విచ్చలవిడి రసాయనాలను వాడకుండా వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే వాడాలన్నారు. ఫర్టిలైజర్ యజమానులు కూడా రైతులకు అవసరం మేరకు మందులు విక్రయించాలని, రైతుల బలహీనతను ఆసరా చేసుకొని అనవసరపు మందులు అంటగటవద్దని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టిన పంటల నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో శ్రీకాంత్, ఏఈవోలు సతీశ్, రమాకాంత్, ప్రకాశ్‌గౌడ్ ఉన్నారు.

జెండాబాలాజీ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు, భక్తులు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈవో వేణు, ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, దేవాదాయ కమిషనర్ విజయరామరాజు సమక్షంలో ఆలయ సభ్యులు, భక్తుల ద్వారా హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. హుండీలో రూ.5,34,840 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రామాగౌడ్, రాజేశ్వర్, విజయ, నర్సింగరావు, నాగభూషణం, సంతోష్, అర్చకులు నాగరాజు, జూనియర్ అసిస్టెంట్లు ప్రశాంత్‌కుమార్, ఆంజనేయులు, రఘునాథ్ కులకర్ణి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సమాచార హక్కు చట్టానికి తూట్లు

- సూపరింటెండెంట్ ఫోన్ నంబర్ మాయం
- పర్యవేక్షణ అధికారికి ఫోన్‌చేసేదెలా..!



అధికారుల ఫోన్ నంబర్లు లేని సమాచార బోర్డు

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార బోర్డులు, పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పీలు చేయాల్సిన అధికారి పేరు హోదా, ఫోన్ నంబర్లు రాసి మరీ బోర్డులు ఏర్పాటు చేశారు. జీజీహెచ్‌లో ఇందుకు పూర్తిగా భిన్నంగా నడుస్తోంది. జీజీహెచ్‌లో సమాచార హక్కు చట్టం బోర్డు మాత్రం ఉంది. అందులో పౌర సమాచార అధికారి పేరు బదిలీ అయినా అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ నంబర్ 8688826834 ఉంది. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ అధికారి ఫోన్ నంబర్ మాత్రం లేదు. ఏడీ సంతోష్‌కుమార్ రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. కొత్తగా ఇన్‌చార్జి ఏడీ రాజశేఖర్ విధులు నిర్వహిస్తున్నారు. కొత్త ఏడీ పేరు, ఫోన్ నంబర్ బోర్డులో ఏర్పాటు చేయలేదు. ఇక జీజీహెచ్ సూపరింటెండెంట్ డిపార్ట్‌మెంట్ ఫోన్ నంబర్ 8688826835 పని చేయడం లేదు. సహచట్టం బోర్డులో కూడా ప్రదర్శించకపోవడం విడ్డూరంగా ఉంది. కనీసం బోర్డులో పర్యవేక్షణ చేయాల్సిన అధికారి ఫోన్ నంబర్ కూడా లేదు. ఇక జీజీహెచ్‌కు వచ్చే రోగులకు కనీస సమాచారం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక తికమక పడుతున్నారు.

సెల్ టవర్ ఎక్కిన జీపీ కార్మికుడు



బీబీపేట: మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థిక సమస్యలు నెలకొంటున్నాయని వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఓ జీపీ కార్మికుడు సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. వివరాలిలా ఉన్నాయి. బీబీపేట మండలం ఇస్సానగర్‌కు చెందిన కొమ్మురాజు జీపీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని గురువారం సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న జీపీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి జీతాల మంజూరుకు కృషి చేస్తామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో నీట మునిగి నలుగురి మృతి



బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన చిన్న మల్లైన్న(32) బుధవారం ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. గురువారం కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా మండల శివారులోని శ్మశాన వాటిక వద్ద మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు మెండోరా ఎస్సై నారాయణ పేర్కొన్నారు.

కోటగిరి శివారులో..

రుద్రూర్: కోటగిరి శివారులోని కాలువలో ప్రమాదవశాత్తు ఒకరు పడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పాత బాన్సువాడకు చెందిన సాయిరాం(40) భార్య విజయ మధ్య గొడవలు జరగడంతో కోటగిరి మండలం ఎత్తొండలో ఉన్న తల్లిగారింటికివచ్చింది. దీంతో సాయిరాం బుధవారం ఎత్తొండకు వస్తున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కానీ గురువారం ఉదయం కోటగిరి శివారులోని కాలువలో మృతదేహమై కనిపించాడు. మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోతంగల్ చెరువులో..

పోతంగల్: మండల కేంద్రంలోని చెరువులో గురువారం మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు పోతంగల్ చెందిన గూండ్ల సాయవ్వ(43)గా పోలీసులు గుర్తించారు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిన సాయవ్వ తిరిగి రాలేదు. సాయవ్వకు మతిస్థిమితం సరిగా లేనందున ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువలో..

నిజాంసాగర్: మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో నాలుగు రోజుల క్రితం కొట్టుకు పోయిన గుర్తుతెలియని మహిళ మృతదేహం గురువారం మహమ్మద్‌నగర్ మండలంలోని ముగ్దంపూర్ శివారు కాలువలో లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి ఒంటిపై నీలి రంగు చీర, పసుపు రంగు జాకెట్ ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

నాసిరకం పాలకోవా తిని అస్వస్థత

- శాంపిల్స్ సేకరించిన బల్దియా సిబ్బంది



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఓ వ్యక్తి బండిపై కొనుగోలు చేసి పాలకోవాను తన కుమారుడికి తినిపించాడు. పాలకోవా తిన్న ఆ బాలుడు అస్వస్థకు గురయ్యాడు. వెంటనే తండ్రితో పాటు చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. పాలకోవా విక్రయించిన వ్యక్తిని పట్టుకొని బల్దియా సిబ్బందికి అప్పగించారు. పాలకోవాను నాసిరకమైన పదార్థాలతో తయారు చేసినట్లు బాలుడి తండ్రి అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు పాలకోవా బండిని మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. ఫుడ్‌సేఫ్టీ సిబ్బంది శాంపుల్స్ సేకరించారు. పాలకోవాను కర్నూలు జిల్లాలో తయారు చేసి రెండు రోజులకు ఒకసారి అక్కడి నుంచి జిల్లాకు తీసుకు వస్తున్నారని తెలిసింది. ఆ పదార్థం జిల్లా కేంద్రంలో రోడ్డు వెంట తిరుగుతూ విక్రయిస్తున్నట్లు తెలిసింది.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు



బొల్లి సన్నీ (ఫైల్)

బాల్కొండ: రోడ్డు డివైడర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ముప్కాల్ మండల శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన బొల్లి సన్నీ(19) అతని స్నేహితులు అన్నెపాక గోపి, చెన్నూర్ అరవింద్ కలిసి ఒకే బైక్‌పై జాతీయ రహదారి పక్కన్న పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. పెట్రోల్ పోయించుకుని తిరిగి వస్తుండగా లక్ష్మి కాలువ వంతెన వద్ద రోడ్డు డివైడర్‌ను వేగంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో సన్నీ, గోపీలకు తీవ్ర గాయాలు కాగా అరవింద్‌కు నడుము భాగంలో బలమైన గాయమైంది. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సన్నీ తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రాణం తీసిన వాటర్ హీటర్



రాతు సాయిలు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): స్విచ్ ఆన్‌లో ఉన్న వాటర్ హీటర్‌ను చేతితో పట్టుకున్న ఓ వ్యక్తి కరెంట్‌షాక్‌తో మృతి చెందిన ఘటన మహమ్మద్‌నగర్ మండలం తుంకిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిలు(53) హైదరాబాద్‌కు వెళ్లేందుకు గురువారం ఉదయం 4 గంటలకు లేచాడు. వేడినీటి స్నానం కోసం బకెట్‌లో వాటర్‌ను నింపి హీటర్ ఆన్ చేశాడు. దానిని ఆఫ్ చేసే క్రమంలో వేరే బటన్‌ను ఆఫ్ చేసి హీటర్‌ను పట్టుకోవడంతో కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నగరంలో కత్తిపోట్లు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో వినాయక శోభాయాత్రను చూసేందుకు వెళ్లిన అన్నదమ్ముళ్లపై జరిగిన కత్తిపోట్లు కలకలం రేపింది. మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్య కాలనీకి చెందిన అజయ్, అర్వింద్ ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరు బుధవారం తెల్లవారుజామున అదే ప్రాంతంలోని ఓ గణేశ్ శోభాయాత్రను అందరితో కలిసి రోడ్డుపై వీక్షిస్తుండగా సదరు మండప నిర్వాహకులు శోభాయాత్రలో పాల్గొన్న వారిని అడ్డుకున్నారు. దీంతో తాగిన మైకంలో ఉన్న నలుగురు యువకులు తమను ఎందుకు అడ్డుకున్నావంటు అజయ్‌పై చేయి చేసుకున్నారు. అక్కడే ఉన్న అర్వింద్ మా అన్నను ఎందుకు కొడుతున్నారంటు వారిని అడ్డుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో వారు అర్వింద్‌ను కత్తితో దాడి చేశారు. స్థానికులు వెంటనే అర్వింద్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అవమానభారంతో ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: మహిళా సంఘంలో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించలేదని సంఘ సభ్యులు ఇంటికి వచ్చి నిలదీయడంతో అవమానభారానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పీఎస్ పరిధిలోని రాంనగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్‌కు చెందిన రజిని, ప్రభుగౌడ్(43) దంపతులు. రజిని మహిళా సంఘంలో రూ. రెండు లక్షల రుణం తీసుకొని ఆరు నెలలుగా తీసుకున్న రుణానికి నగదు చెల్లింపులు చేయడం లేదు. దీంతో మహిళా సంఘ సభ్యులు ఇంటికి వచ్చి లోను నగదుపై నిలదీశారు. సభ్యులు ఇంటికి వచ్చి తన భార్యను నిలదీయడంపై అవమానభారానికి గురైన ప్రభుగౌడ్ స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్ తనపై కొందరు దాడిచేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన జక్కుల రాజేశ్ అనే వ్యక్తి పెద్దమల్లారెడ్డి శివారులో ఉన్న ఓ ఫామ్‌హౌస్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈనెల 17న కొండల్‌రెడ్డి అనే వ్యక్తి ఫామ్‌హౌస్ గేట్ ఎదుట కారును నిలిపాడు. కారును తీయాలని వాచ్‌మన్ రాజేశ్ కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కొండల్‌రెడ్డి కొంతమందికి ఫోన్‌చేసి అక్కడికి రప్పించి తనపై దాడికి పాల్పడ్డారని అన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఎడపల్లి: మండలంలోని పోచారం గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డెటి పూజిత(35) ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటోంది. పూజిత భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు కుటుంబీకులు సైతం ఎవరూ లేరు. పూజిత గురువారం ఉదయం తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య తీరుపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళకు పరిచయం ఉన్న వ్యక్తులే హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీపై కేసు

బాన్సువాడ: రైస్‌మిల్లు నుంచి ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ధాన్యం లారీపై బీర్కూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. డోంగ్లి మండలం కుర్ల రైస్‌మిల్లు నుంచి ధాన్యాన్ని అక్రమంగా బీర్కూర్ మీదుగా తరలిస్తుండగా గమనించిన బీర్కూర్ వాసులు లారీని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు లారీని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేశారు. లారీలో 295 క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు గుర్తించారు. గత రబీలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కుర్ల రైస్ మిల్‌కు పంపించారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా రైస్ మిల్లు యజమాని ఇతర ప్రాంతానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత రబీలో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం, నిజాంసాగర్, పలు మండలాల్లో ఉన్న రైస్‌మిల్లులకు తరలించిన విషయం తెలిసిందే. కానీ రైస్ మిల్లుల యజమానులు ధాన్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారు.

చోరీ కేసులో ఆధారాల సేకరణ

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లిలో చోరీ జరిగిన కేసులో క్లూస్‌టీం అధికారులు గురువారం వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. బుధవారం కళావతి ఇంట్లో రెండు తులాల బంగారు నెక్లెస్, సెల్‌ఫోన్ చోరీకి గురైన విషయం తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. క్లూస్‌టీంను రప్పించారు. అలాగే గ్రామంలో సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

ప్రేమ విఫలం.. యువకుడి బలవన్మరణం

నిజామాబాద్ రూరల్: ప్రేమ విఫలమైందని ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పీఎస్ పరిధిలోని ఖానాపూర్ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటో డివిజన్ ఖానాపూర్‌కు చెందిన గౌతమ్ (28) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా అదే ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించడంతో ఆమె ప్రేమను నిరాకరించింది. దీనికి తోడు గౌతమ్ తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఖానాపూర్ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఫిలిప్పీన్స్‌లో రోడ్డు ప్రమాదం

- వేల్పూర్‌కు చెందిన వైద్య విద్యార్థి మృతి



నీరడి అక్షయ్(ఫైల్)

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన నీరడి అక్షయ్(23) అనే వైద్య విద్యార్థి ఫిలిప్పీన్స్ దేశంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీరడి అక్షయ్(23) ఫిలిప్పీన్స్ దేశంలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఈనెల 15న కాలేజీ నుంచి తాను నివసించే ఇంటికి మోపెడ్‌పై వెళ్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మరణించాడు. అక్షయ్ తండ్రి నీరడి రాజన్న వరంగల్ మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వారి కుటుంబం సుమారు ఇరవై ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడింది. మరో ఆరు నెలల్లో అక్షయ్ ఎంబీబీఎస్ పూర్తయ్యేదని, అంతలోనే ఇలా జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. అక్షయ్ మృతదేహం శనివారం హైదరాబాద్‌కు చేరే అవకాశం ఉందని తెలిపారు.